సాక్షి కర్నూలు

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



అన్నదానానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి శని వారం కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జి.నాగ మణి రూ.2 లక్షల విరాళాన్ని పర్యవేక్షణకులు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.



అలరించిన తోలుబొమ్మలాట

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్య కళా వేదికపై శని వారం కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన సాయినిలయ బృందం వారి వినాయక విజయం తోలుబొమ్మలాట ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.91
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.421
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 73,241
అవుట్ ఫ్లో	: 74,025

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వర్షాలు

- తాజాగా 19 మండలాల్లో కురిసిన వానలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు కొన సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 19 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా 39.4, అత్య ల్పంగా 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎమ్మిగనూరులో 39.4 మిమీ, తుగ్గలిలో 26, హొళగుందలో 25.2, ఆదోనిలో 21.4, పెద్దక డుబూరులో 18.6, పత్తికొండలో 18.6, నం దవరంలో 11.2 మి.మీ. వర్షపాతం నమోదైం ది. జిల్లా మొత్తం మీద సగటున 7.8 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు స్పష్టమవుతోం ది. అక్టోబరు నెల 19 వరకు సాధారణ వర్ష పాతం 67.5 మి.మీ ఉండగా... 78.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 16 శాతం ఎక్సెస్ వర్షపాతం నమోదైంది.

ముగిసిన పవిత్రోత్సవాలు



గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలం లో వెలసిన ప్రహ్లాదవరదస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారం తెల్లవా రుజామున పూర్ణాహుతితో ముగిశాయి. ఉత్స వమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదులను యాగశాలలో కొలువుంచి నవకళస్థా పన, అభిషేకం నిర్వహించి నూతన పట్టు పీతాం బరాలతో అలంకరించి కొలువుంచి పవిత్ర హోమం చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి నిత్యపూజ అనంతరం శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, అర్ధరాత్రి అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి అమ్మవార్లకు తిరుమంజనం, సంప్రోక్షణం, శని వారం తెల్లవారుజామున శాత్తుమురై గోష్ఠితో పవిత్రోత్సవాన్ని ముగించారు.

పెరుగుతున్న ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఐదారు రోజుల కిత్రం వరకు క్వింటాలు ధర రూ.4,000 లోపు ఉంది. ఈ నెల 10న గరిష్ట ధర రూ.3,829 ఉండ గా...14 నుంచి పెరుగుదల మొదలైంది. శని వారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 208 మంది రైతులు 4,643 క్విం టాళ్లు తెచ్చారు. కనిష్ట ధర రూ.495, గరిష్ట ధర రూ. 4329 లభించింది. సగటు ధర రూ.3,591 నమోదు అయింది. వర్షాలు పడుతున్నందున ఉల్లిగడ్డలు తడుస్తున్నాయి. ఈ సమయంలోనే ధరలు పెరుగుతుండటాన్ని పరిశీలిస్తే దేశంలో ఉల్లికి డిమాండ్ పెరిగినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ డాక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించను న్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచిం చారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి ఫిర్యాదు లను స్వీకరిస్తున్నట్లు ఆయన వివరించారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

కర్నూలు కల్చరల్: ఉన్నత విద్య చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలోని బీదర్‌లో ఉన్న తమ ఇనిస్టిట్యూట్ పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తుంద న్నారు. ఈ క్రమంలో డిగ్రీ, పీజీ అభ్యసించే విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు తెలి పారు. ఈనెల 26వ తేదీన రాత పరీక్ష ఉంటుం దని.. ఆసక్తి గలవారు ఈనెల 22వ తేదీలోగా www.shaheengroup.org/cuet వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దేశ వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 85498 97767ను సంప్రదించాలన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు(హాస్పిటల్): కేజీబీవీ ఉపాధ్యాయ నియామకాల ఖాళీ పోస్టులకు ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా ప్రకారం ఈ నెల 20వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని డీఈవో కె. శామ్యూల్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19వ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలని ఇది వరకే తెలిపామని, అయితే కొంత మంది హాజరుకానందున 20వ తేదీన కూడా ధ్రువీకరించుకోవచ్చన్నారు. జాబి తాలో లేని అభ్యర్థులు, సర్టిఫికెట్ల ధ్రువీకరణ కోసం రావాల్సిన అవసరం లేదన్నారు.

తమ్ముళ్లకు పండగ

'అధికారంలోకి వచ్చాం.. ఇక పండగ చేస్కోండి' అంటూ టీడీపీ నేతలకు కూటమి ప్రభుత్వమే దోపిడీ మార్గాన్ని చూపింది. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి.. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి సొంత పార్టీ నేతల బొజ్జలు నింపుతోంది. ఉపాధి నిధులు కొల్లగొట్టేలా తెలుగు తమ్ముళ్లకు రూ. కోట్ల విలువ చేసే పనులు కట్టబెట్టింది. అధికారుల అండతో ఇక ప్రజా సొమ్మును దోచుకునేందుకు ఊరూరా టెంకాయ కొట్టారు. ధన దాహంతో నిధులు మింగేసి అరకొర నాణ్యతతో చేపట్టే పనులు మున్నాళ్ల ముచ్చటే అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఓర్వకల్లు మండలం ఉప్పలపాడులో పశువుల షెడ్డుకు భూమి పూజ చేసిన దృశ్యం

- రూ.82.69 కోట్లతో 1,532 పనులకు భూమి పూజ
- పశువుల షెడ్లు టీడీపీ కార్యకర్తలకే
- ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితా ప్రకారమే మంజూరు
- థర్డ్ పార్టీ పేరుతో తెలుగు తమ్ముళ్లకే సీసీ రోడ్లు
- నాటి అక్రమాలు పునరావృతం అయ్యే అవకాశం
- నేటితో ముగియనున్న పల్లెపండుగ వారోత్సవాలు

నియోజకవర్గాల వారీగా పల్లె పండుగ వారోత్సవాల్లో ప్రారంభించిన పనుల వివరాలు

నియోజక వర్గం	సీసీ రోడ్లు/ పశువుల షెడ్లు	నిధులు (రూ.కోట్లలో)
ఆదోని	127	4.11
ఆలూరు	418	21.98
కోడుమూరు	226	12.65
మంత్రాలయం	182	11.80
పాణ్యం(ఓర్వకల్/కల్లూరు	121	6.61
పత్తికొండ	339	17.51
ఎమ్మిగనూరు	119	8.02
మొత్తం	1,532	82.68

షెడ్ల నిర్మాణాలకు సబ్సిడీలు ఇలా ఉన్నాయి...

షెడ్డు	యూనిట్‌కాస్ట్ (రూపాయల్లో)	సబ్సిడీ 90 శాతం	రైతువాటా 10 శాతం
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు పశువులు	1,85,000	1,66,500	18500
ఆరు పశువులు	2,30,000	2,07,500	23,00
గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు			
షెడ్లు	యూనిట్‌కాస్ట్	సబ్సిడీ (70 శాతం)	రైతువాటా (30 శాతం)
20 గొర్రెలు/మేకలు	1,30,000	91,000	39,000
50 మేకలు/గొర్రెలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, పశువుల షెడ్ల పేరుతో నిధులు కొల్లగొట్టడానికి తెలుగు తమ్ముళ్లు ఊరూరా శంకుస్థాపనలు చేసేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆకలితో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలకు 'పల్లె పండగ' బాగా కలిసి వచ్చింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మొదటి దశలో మెటీరియల్ కాంపోనెంటు కింద జిల్లాలో రూ.82.59 కోట్లతో 1,532 పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 14వ తేదీ నుంచి పల్లెపండుగ వారో త్సవాల్లో ఈ పనులకు శ్రీకారం చుట్టి దోపిడీకి టెం కాయ కొట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే సీసీ రోడ్లు, పశువుల షెడ్ల పనులకు ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌చార్జ్‌లు భూమి పూజ చేశారు. ఈ పనులన్నింటినీ 100 రోజుల్లో అంటే సంక్రాంతి సమయానికి పూర్తి చేసే విధంగా ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. అప్పుడు కూడా పల్లె పండుగ రెండవ విడత కార్యక్రమాన్ని నిర్వహించి ప్రారంభించనున్నారు. ఒకవైపు మెటీరి యల్ కాంపొనెంటు కింద సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, కాంపౌండ్ వాల్స్, బీటీ రోడ్లు, మరోవైపు లేబర్ కాం పోనెంటు కింద చేపట్టే అన్ని రకాల పనులు టీడీపీ నేతలు, కార్యకర్తల నేతృత్వంలోనే జరుగుతుండటం తో నాణ్యత ఏమేర ఉంటుందో తెలుస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మొదటి విడతలో 845 సీసీ రోడ్ల పనులకు పల్లెపండుగ వారోత్సవాల్లో శ్రీకారం చుట్టారు. టీడీపీ కార్యకర్తలు నేతల కోసమే సీసీ రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. టీడీపీ నేతలు, కార్యకర్తలను ఆర్థికంగా ఆదుకునేందుకే ప్రభు త్వమే ఈ పనులు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 2014-15 నుం చి 2018-19 వరకు మెటీరియల్ కాంపోనెంటు కింద చెక్‌డ్యామ్‌ల పేరుతో నిధులు ఏ విధంగా కొల్లగొట్టారో మళ్లీ అదే తరహా దోపిడీకి రంగం సిద్ధమైందనే విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటి అవినీతి అక్రమాలే పునరావృతం అవుతున్నట్లు తెలుస్తోంది. మొదటి విడ తలో ప్రతి మండలంలో సీసీ రోడ్ల పేరుతో రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. ఆలూరు నియోజక వర్గంలో అత్యధికంగా 418 రూ.21.98 కోట్లతో 418 పనులను ప్రారంభించడం గమనార్హం.

అర్హులకు మొండిచేయి..

పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు గ్రామీణ ప్రాంతా లకు చెందిన రైతులు, పశువులు, జీవాల, కోళ్ల పెంప కందారులు ఆసక్తి చూపుతున్నారు. షెడ్లకు దరఖా స్తులు వెల్లువెత్తాయి. షెడ్లు మాత్రం అతి తక్కువగా ఉన్నాయి. ఉపాధి నిధులతో కర్నూలు జిల్లాలో 1,200 నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం ది. పశువుల షెడ్లుకు 90 శాతం, గొర్రెలు మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ఉంటుంది. షెడ్లకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 2,145 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 687 షెడ్లకు మాత్రమే పరిపాలన అనుమతులు లభిం చాయి. మిగిలిన 513 షెడ్ల నిర్మాణాలకు కూడా అను మతులు లభించనున్నాయి. అయితే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలకు, అనర్హులకు పెద్దపీట వేస్తూ... నిజమైన రైతులు, పశుపోషకుల దరఖాస్తు లను బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఆలూరు, మంత్రాలయం నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఉన్నా... అక్కడ కూడా టీడీపీ నేతలే ఇన్ చార్జీలతో పేరుతో హవా నడుపుతున్నారు. టీడీపీ నేతలే పశువుల షెడ్ల మంజూరులో అంతా తామై వ్యవహరిస్తున్నారు. ఆదోని నియోజక వర్గంలో మాత్రం లబ్ధిదారుల ఎంపికలో బీజేపీ, టీడీపీ నేతల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఇటు టీడీపీ, అటు బీజేపీ నేతలను సంతృప్తి పరిచేందుకే కేవలం ఆదోని మండలానికే 82 పశువుల షెడ్లను మంజూరు చేశారు. వాస్తవానికి ఆదోని మండలానికి కేటాయించింది 70 మాత్రమే. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లోని సాంకేతిక సహాయ కులు పశువుల షెడ్లను నిర్మాణాలకు మార్కింగ్ ఇస్తే సంబంధిత లబ్ధిదారులే నిర్మించుకోవాల్సి ఉంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధికి పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాం తాల మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లింది. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలను అందుబాటులోకి తెచ్చి గ్రామస్థాయిలోనే అన్ని వర్గాల ప్రజలకు దళారీల ప్రమేయం లేకుండా... అవినీతికి తావు లేకుండా అన్ని రకాల సేవలు అందించింది. ఉపాధి నిధు లతో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, పాలశీతలీకరణ కేంద్రాలు వంటి వాటిని నిర్మించింది. ఇవి గ్రామీణాభివృద్ధికి నిదర్శనంగా నిలిచాయి. అయితే కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, రైతుభ రోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తూ ప్రజలకు సేవలు దూరం చేస్తోంది.



గత టీడీపీ పాలనలో ఉపాధి నిధులతో నిర్మించిన చెక్‌డ్యామ్ దుస్థితి

ర్యాగింగ్ సంస్కృతికి దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్, చిత్రంలో డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ లీలా వెంకట శేషాద్రి, అధికారులు

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(హాస్పిటల్): ర్యాగింగ్ అనేది ఒక చెడ్డ సం స్కృతి అని, విద్యార్థులు దానికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ వ్యతిరేక అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇంట్లో తమ తమ్ముళ్లకు, చెల్లె ళ్లకు వారి సీనియర్స్ పేరిట కాలేజీలో ర్యాగింగ్ చేస్తే మీకు ఏ విధమైన భావన కలుగుతుందో అదే భావన మీ జూనియర్స్‌పై కూడా కలిగి ఉండాలని అన్నారు. ప్రతి వ్యక్తికీ స్వీయ గౌరవం ఉంటుందని, దాన్ని దెబ్బతీసే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటి లీలా వెంకట శేషాద్రి మాట్లా డుతూ ర్యాగింగ్ వ్యతిరేక చట్టం చిన్నదే అని, అయితే అందులో సెక్షన్లు చాలా కఠినతరమైనదన్నారు. తెలి యక చేశామని విద్యార్థులు చెప్పినా చట్టం ఒప్పుకో దని, చట్టం తన పని తాను చేస్తుందన్నారు. ర్యాగిం గ్‌కు చట్టం వేసే శిక్షతో భవిష్యత్ అంధకారం అవుతుం దని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినర సమ్మ మాట్లాడుతూ ఎన్ఎంసీ, యూనివర్సిటీ నిబంధ నల మేరకు ర్యాగింగ్ విషయంలో కఠినంగా ఉంటామ ని, విద్యార్థులు ఎవరూ భయపడవద్దని, ఎలాంటి సం ఘటన జరిగినా నిర్భయంగా తమకు తెలియజే యాలని చెప్పారు. ర్యాగింగ్ లాంటి సంఘటనలు జర గకుండా అన్ని స్థాయిల్లో కమిటీలు వేశామని తెలిపా రు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసు ధీర్, డాక్టర్ విజయ్ ఆనందబాబు, వార్డెన్లు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవీశ్యామల పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో దళారులను నమ్మొద్దు

కర్నూలు(అర్బన్): వైఎస్సార్ జిల్లా కేంద్రం కడప డీఎస్ఏ స్టేడియంలో నవంబర్ 10 నుం చి 15 వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని గుంటూరు ఆర్మీ నియామకం డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్ సూచించారు. ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, ఆఫీసు అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, 10 టీహెచ్ ట్రేడ్స్‌మెన్, 8 టీహెచ్ ట్రేడ్స్‌మెన్ నియామ కాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన అభ్యర్థులు కూడా ఇందులో ఉన్నారన్నా రు. అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించేందుకు సహకారం అందిస్తామన్నారు. కష్టపడిన వారికి, మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తా మన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పొందిన అడ్మిట్ కార్డులను, వివిధ పత్రాలను తప్పనిసరిగా తీసుకునిరావాలన్నారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



ఈఆర్ఓ, ఏఈఆర్ఓలతో టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (సెంట్రల్): ఓటర్ల జాబితా సవరణ (ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025)ను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను ఆదేశించారు. శనివారం స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 అంశంపై ఈఆర్ఓ, ఏఈఆ ర్ఓలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన డ్రాఫ్ట్ రోల్ ప్రచురించాల్సి ఉందన్నారు. ఈ సమయం చాలా కీలకం అని, ఈ లోపు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆదే శించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్, అబ్జెక్షన్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి 625, ఆదోని 520, ఎమ్మిగ నూరు 375 క్లైయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రా లయం, పాణ్యం నియోజకవర్గాల్లో కూడా క్లైయిమ్స్, అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశిం చారు. అలాగే డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌కు సం బంధించి 19 వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ఏఈఆర్ఓ లను ప్రశ్నించారు. 30 రోజుల్లోపు వీటిని పరిష్కరిం చాల్సి ఉందని, 30 రోజులు దాటినా పెండింగ్‌లో ఉంచిన ఏఈఆర్ఓలకు వెంటనే నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సంబంధిత ఈఆర్ఓలను కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పాణ్యం అసెంబ్లీ ఈఆర్వో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్, ఆదోని అసెంబ్లీ ఈఆర్వో మౌర్య భర ద్వాజ్, పత్తికొండ అసెంబ్లీ ఈఆర్వో భరత్‌నాయక్, కోడుమూరు అసెంబ్లీ ఈఆర్వో సందీప్ కుమార్, ఎమ్మిగనూరు అసెంబ్లీ ఈఆర్వో నాసరరెడ్డి, మం త్రాలయం అసెంబ్లీ ఈఆర్వో విశ్వనాథ్, ఆలూరు అసెంబ్లీ ఈఆర్వో రాము నాయక్, డీఆర్వో చిరంజీ వి, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

నకిలీ విజిలెన్స్ ముఠా అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ బాబుప్రసాద్



స్వాధీనం చేసుకున్న కారు

ఓర్వకల్లు: విజిలెన్స్ అధికారులమంటూ బియ్యం వ్యాపారిని బెదిరించిన ఐదుగురితో కూడిన ముఠాను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల వివ రాలను కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఆళ్లగడ్డ బాలాజీ వీధికి చెందిన పాలకం టి మధుసూదన్, నంద్యాల రైతు నగర్‌కు చెందిన శీలం అంకిరెడ్డి, పాణ్యం మండలం మద్దూరుకు చెం దిన పరదేశి రవికుమార్, నంద్యాల శ్రీనివాస సెంట ర్‌కు చెందిన కొరతాల మహేష్, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఆవుల మధు ముఠాగా ఏర్పడ్డారు. జల్సాల కోసం పైరవీలు చేసే వారు. ఓ స్కార్పియో వాహనాన్ని కొలుగోలు చేసి దానికి విజిలెన్స్ అధికారుల బోర్డు పెట్టుకొని ఆర్థిక నేరాలకు పాల్పడేవారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో నన్నూరు సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో నివాసముంటున్న బియ్యం వ్యాపారి గంగా ధర్ వద్దకు వెళ్లి విజిలెన్స్ అధికారులంటూ బెదిరిం చారు. రూ.2.50 లక్షలు ఇవ్వకపోతే అరెస్టు చేస్తామన డంతో వ్యాపారి రూ.10 వేలు చెల్లించుకున్నాడు. అంత లోనే అనుమానం వచ్చి.. తహసీల్దార్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయ్యింది. ఈక్రమంలో తమ బండారం బయటపడుతుందని భావించిన దుండగులు పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని మళ్లీ బెదిరించారు. సదరు ఫోన్‌కాల్ కర్నూలు డీఎస్పీకి వెళ్లడంతో ఆయన తనదైన శైలిలో ఆరా తీసి, వ్యవహారం తేడాగా ఉందని గుర్తించి వెంటనే ఓర్వకల్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌కు సమాచారం చేరవేశారు. ఆయన తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకునేలోపు దుండగులు పరార య్యారు. గాలింపు చర్యలు చేపట్టగా శనివారం ఉద యం హుసేనాపురంలో ఓ హోటల్ వద్ద టీ తాగుతూ కనిపించడంతో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు వాహనాలు, 7 సెల్ ఫోన్లు, ఐడీ కార్డులు, రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశం లో సీఐ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

నకిలీ ఆధార్ సృష్టించి.. రూ. కోట్ల స్థలం కాజేసి

- ఆదోని ఎమ్మెల్యే అనుచరుడు దర్జాగా భూ కబ్జా
- నకిలీ ఆధార్ కార్డుతో అక్రమ రిజిస్ట్రేషన్
- అధికారులను ఆశ్రయించిన బాధితుడు



ఎస్కేడీ కాలనీలో కబ్జాకు గురైన స్థలం



సబ్‌రిజిస్ట్రార్ అజామియాకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఆదోని అర్బన్: 'నేను ఎమ్మెల్యే అయితే ఆదోని పట్ట ణంలో ఇక కబ్జాలు అనే మాట వినిపించకుండా చేస్తా' అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి.. నాలుగు నెలలుగాక ముందే ఆయన అనుచరుడు భూ కబ్జాకు పాల్పడ్డాడు. ఏకంగా తన తల్లికి స్థలం బాధితురాలి పేరుతో నకిలీఆధార్‌కార్డును సృష్టించి రూ. కోట్ల విలువైన స్థలం ఆక్రమించిన ఘటన శనివారం వెలు గులోకి వచ్చింది. ఈ విషయంపై శనివారం సాయంత్రం బాధితురాలు కురువ హనుమంతమ్మ కుమారులు కురువ హరీష్‌బాబు, రాజశేఖర్ ఆదోని సబ్ రిజిస్ట్రార్ అజామియాకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కురువ హనుమంతమ్మ పేరుపై ఎస్కేడీ కాలనీలో 1984లో ఆరు సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ అయ్యింది. సర్వే నంబర్ 380ఏ, 379బీలో ప్లాట్ నంబర్ 33సీ ఉంది. ఆమె కుటుంబం ప్రస్తుతం కర్నూలులో నివాసముంటోంది. ఆ స్థలానికి రక్ష ణగా ఉండాలని తెలిసిన వారికి గడ్డివాము వేసేం దుకు ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ సెంటు విలువ రూ.30 లక్షలు ఉంది. మొత్తం రూ.1.80 కోట్ల విలువ చేసే స్థలంపై ఎమ్మెల్యే అనుచరుడు డాక్టర్ రవికిరణ్ కన్ను పడింది. తన తల్లి జయలక్ష్మి పేరును కురువ హనుమంతమ్మగా నకిలీ ఆధార్ కార్డు సృష్టించాడు. మూడు రోజుల క్రితం (ఈనెల 16వ తేదీన) రవికిరణ్ దర్జాగా తల్లిని జయలక్ష్మిని సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకెళ్లి అతని బావమరిది అయిన చిప్పల సురేష్‌బాబు పేరుపై రూ.1.80 కోట్ల విలువైన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇక తనకు అడ్డు ఎవరూ లేరని ఆ స్థలంలో గడ్డివాము వేసుకున్న వారిని ఖాళీ చేయించాడు. దీంతో బాధి తులకు విషయం తెలిసి శనివారం ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకుని ఆరా తీశారు. ఆ స్థలం వారి పేరు మీద లేకపోవడంతో ఆందోళన చెందారు. విచారణ చేయగా కురువ హనుమం తమ్మ పేరును మాత్రమే ఆధార్‌కార్డులో ఫోర్జరీ చేసి రవికిరణ్ తల్లి జయలక్ష్మి వేరొకరికి అక్రమంగా రిజి స్ట్రేషన్ చేసినట్లు వెలుగు చూసింది. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ అజామియా దృష్టికి తీసుకెళ్లగా.. నకిలీ డాక్యుమెంట్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తంబ్ ఇం ప్రెస్‌ను పరిశీలించగా రవికిరణ్ తల్లి జయలక్ష్మి కురువ హనుమంతమ్మగా ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడింది. ఈ విషయంపై తాము టూటౌన్ పోలీసులు, డీఎస్పీకి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

పెద్దకడబూరు : ఆటోలో నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామ సమీపంలో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వివరాల మేరకు.. హెచ్.మురవణి గ్రామానికి చెందిన ఓతూరు నాగరాజు భార్య జయమ్మ(57) శనివారం తోటి కూలీలతో కలిసి పొలం పనులకు ఆటోలో బయలు దేరింది. గ్రామ సమీపంలోని ఎమ్మిగనూరు – మాలపల్లి ప్రధాన రహదారిలో నాలుగో మైలురాయి దాటిన తరువాత విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర డ్రైవర్ ఆటోను వేగంగా నడపడంతో అందులో నుంచి జయమ్మ కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు భర్త ఓతూరు నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


మృతి చెందిన బోయ మంజుల

కోడుమూరు రూరల్: అనుగొండ గ్రామంలో పొలం పనులు చేస్తుండగా పిడుగు పాటుకు గురై ఓ మహిళ మృతిచెందారు. శనివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. అనుగొండకు చెందిన బోయ బాల మద్దిలేటి భార్య బోయ మంజుల (35) మరో నలుగురు మహిళలతో కలిసి శనివారం పొగాకు పొలంలో కలుపుతీతకు వెళ్లింది. అయితే, సాయంత్రం సమయంలో చిన్నపాటి వర్షం మొదలై వీరికి సమీపంలో పిడుగు పడింది. పిడుగు దాటికి పొలంలో పనిచేస్తున్న మంజులతో పాటు, లక్ష్మీదేవి, అనేశ్వరి, అనురాధ, మహేశ్వరిలు స్పృహ తప్పి పడిపోయారు. కొద్దిసేపటికి వీరంతా కోలుకుని లేవగా మంజుల మాత్రం స్పృహలోకి రాలేదు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలికి భర్త బాలమద్దిలేటితో పాటు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం.

ఆగని బెదిరింపుల పర్వం

- సీఎంకు మొరపెట్టుకున్న ఓ మద్యం దుకాణాదారుడు
- సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్

బేతంచెర్ల: అధికారపార్టీ నాయకుల ఆగడాలు పెరిగిపోయాయి. లాటరీల్లో మద్యం షాపులు పొందిన వారిని వివిధ రూపాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారు. మాట వినని వారిని దుకాణం తెరవనివ్వకుండా, మద్యం విక్రయించకుండా చేస్తున్నారు. తాజాగా బేతంచెర్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సీఎం గారూ మీరే సహకరించాలని విడుదల చేసిన వీడియో వైరల్ అవుతోంది. పట్టణానికి చెందిన కల్లూరి లోకేష్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి మద్యం షాపుల కోసం 18 దరఖాస్తులు చేశాడు. ఈనెల 14 వ తేదీన నిర్వహించిన లక్కీడ్రాలో బేతంచెర్ల పట్టణంలోని 72వ షాపు దక్కింది. ఈ దుకాణం దక్కించుకున్న లోకేష్ స్నేహితులతో కలిసి సరుకుకు రూ. 26 లక్షలు డిపాజిట్ చేశాడు. శనివారం పాతబస్టాండ్ సమీపంలో దుకాణం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ ఉదయాన్నే మద్యం కోసం తాము ఇచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వాలని స్నేహితులు ఒత్తిడి పెంచారు. మద్యం షాపు దక్కకపోడంతో అధికారపార్టీ నాయకులు తన స్నేహితులను బెదిరించి షాపు తెరవకుండా అడ్డుకుంటున్నారని శనివారం లోకేష్ వీడియో విడుదల చేశాడు. మీరే ఆదుకోవాలని సీఎం చంద్రబాబును అందులో వేడుకున్నాడు. కూటమి నాయకులు ఇతరులను బతికనివ్వడం లేదని, మద్యం వ్యాపారమంతా తమ గుప్పిట్లో ఉండాలని దుకాణాలు దక్కిన సామాన్యులను బెదిరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఉయ్యాలవాడ మండలం ఇంజేడు గ్రామ సమీపంలో నీట మునిగిన మిరప పంట

నందికొట్కూరు సమీపంలో పొగాకు పొలంలో నిలిచిన వర్షపు నీరు


దేవనకొండలో వర్షం రావడంతో పత్తి విడిపించకుండా వదిలేసిన దృశ్యం


కౌతాళం మండలం మేళిగనూరులో నేలకొరిగిన వరిపైరు

ఎంత కష్టం.. ఎంత నష్టం!



బొల్లవరం గ్రామంలో తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళా రైతు (ఇన్‌సెట్) దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో మొక్కజొన్న కంకులకు మొలకలు వచ్చిన దృశ్యం

రైతన్నల ఆశలు ఆవిరయ్యాయి. చేతికి వచ్చిన పంటలు వర్షం పాలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఐదారురోజులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నంద్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో మోకాళ్లలోతు నీరు నిలవడంతో పైర్లు కుళ్లిపోతున్నాయి. వరి పంట నేలకొరగగా పత్తి, మొక్కజొన్న, ఉల్లి పంటలు తడిసిముద్దయ్యాయి. నందికొట్కూరు, శ్రీశైలం, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో పంట దిగుబడులు వారం రోజులుగా పట్టల కింద ఉండటంతో రంగు మారాయి. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్/నెట్ వర్క్


హొళగుందలో కుళ్లిన ఉల్లిని వేరు చేస్తున్న మహిళలు


కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది


గార్గేయపురం సమీపంలో కోతకోసి పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

హత్య కాదు.. ఆత్మహత్య!

- నగురూరు ప్రేమికుల వ్యవహారంలో కొత్త కోణం
- ప్రేమికులను గదిలో వేసి చితకబాదిన బంధువులు
- అవమానభారంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు తెగించిన అశ్విని
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఆస్పరి: నగురూరులో ప్రేమజంట వ్యవహారంలో కొత్త కోణం వెలుగు చూసింది. మృతి చెందిన అశ్వినీది హత్య కాదు.. ఆత్మహత్య అని తెలుస్తోంది. గ్రామస్తులు, పోలీసు వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అశ్విని, సన్నీ అనే ఇద్దరు మైనర్లు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అశ్విని తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో సన్ని మాట్లాడేందుకు వెళ్లాడు. పక్కింటి వ్యక్తి గమనించి ఇంటికి తలుపు వేసి అశ్విని బంధువులు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి ఇద్దరిని చితకబాదారు. దాడి నుంచి సన్ని తప్పించుకుని పారిపోయాడు. ఈ దాడిలో అతని తలకు బలమైన గాయమైంది. ఆపై అశ్వినిని వారి బంధువుల ఇంట్లో ఉంచారు. ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడం, తమపై కూడా తల్లిదండ్రులు చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన అశ్విని పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అశ్విని, సన్నీ ఫోన్ రికార్డులు, వాట్సాప్ స్క్రీన్‌షాట్లు పోలీసులు తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదటగా అశ్విని ప్రేమించలేదని, సన్నీ పురుగు మందు బలవంతంగా తాపి చంపారనే ప్రచారం జరగడంతో ఈ అంశం కలకలం రేపింది.

వేధింపులు తాళలేక ఆత్మహత్య

సన్ని, అశ్విని వ్యవహారంలో పలు రకాలు వార్తలు వ్యాపిస్తున్నాయి. సన్ని వెంటపడి వేధిస్తున్నారనే కారణంతోనే అశ్విని పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. సన్ని ఎక్కడ ఉన్నాడో తెలీదు. దర్యాప్తులో పూర్తి విషయాలు వెలుగు చూస్తాయి.

– మస్తాన్ వలి, సీఐ, ఆస్పరి

ఎర్రమట్టి అక్రమ రవాణా


అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

డోన్: పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఎర్రమట్టి మాఫియా చెలరేగిపోతోంది. రెవెన్యూ, అటవీ, పోరంబోకు భూములతోపాటు చెరువులు, కుంటలను యథేచ్ఛగా తవ్వి ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. దీంతో గృహ అవసరాలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎర్రమట్టి కాసుల వర్షం కురిపిస్తోంది. ఓబులాపురం, లక్షంపల్లె, అబ్బిరెడ్డిపల్లె చెరువు, గుడితిప్ప ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హంతకుడిని ఎన్‌కౌంటర్ చేయాలి

- పోలీసు స్టేషన్ ఎదుట మృతురాలి కుటుంబ సభ్యుల బైఠాయింపు


పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన మృతురాలు శిరీష కుటుంబ సభ్యులు, బంధువులు

నందికొట్కూరు: కోరిక తీర్చలేదని గొల్ల శిరీషను హత్య చేసిన మామ కురుమన్నను ఎన్‌కౌంటర్ చేయాలని, వేధింపులకు పాల్పడిన భర్త, అత్త, ఆడపడచులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పోలీసుస్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై శిరీష హత్యను నిరసిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. హంతకుడిని తమకు అప్పగించాలంటూ పోలీసు స్టేషన్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో సీఐ సుబ్రమణ్యం జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అలాగే శిరీషను హత్య చేసిన సొంత మామ కురుమన్నను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకుడు వి.రఘురామ్మూర్తి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత డిమాండ్ చేశారు. పటేల్ కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు.

కాల్వలో దొంగల హల్‌చల్!

- వరుసగా నాలుగు ఇళ్లల్లో దోపిడీ
- రూ.3.40 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం అపహరణ


బీరువాలో చెల్లాచెదురుగా వస్తువులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. శుక్రవారం రాత్రి తాళాలు వేసిన నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బీరువాలు పగలగొట్టి అందినకాడికి బంగారు, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన మహబూబ్‌బీ ఇంటి తలుపునకు అమర్చిన ఇనుప హ్యాండిల్‌ను కట్టర్‌తో కత్తిరించి లోపలికి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.3 లక్షల నగదు, 4 తులాల బంగారం దోచుకెళ్లారు. అలాగే మంగలి సుబ్బమ్మ ఇంట్లో తాళం పగలగొట్టి రూ.40 వేలు, జాకిర్ బాష ఇంట్లో రూ.700 నగదు, దేశాయ్‌నూర్ ఇంట్లో 6 గ్రాముల చెవికమ్మలు ఎత్తుకెళ్లారు. శనివారం ఇళ్లకు చేరుకున్న బాధితులు తాళాలు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ సునీల్‌కుమార్ గ్రామానికి చేరుకొని క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జెన్‌కో గృహం అన్యాక్రాంతం


జెన్‌కో గృహం

శ్రీశైలంప్రాజెక్ట్: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి సహకారంతో ప్రైవేట్ వ్యక్తులు శనివారం ఏపీ జెన్‌కోకు చెందిన ప్రభుత్వ గృహాన్ని ఆక్రమించుకున్నారు. తాళాలు పగుల గొట్టి మరీ ఆగృహంలోకి గృహోపకరణాలను చేర్చారు. ఏపీ జెన్‌కో ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ఉద్దేశంతో సదరు అధికారికి శ్రీశైలం జెన్‌కోలో పోస్టింగ్ ఇచ్చారు. కానీ ఆయన మాత్రం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే జెన్‌కో అధికారులను లెక్క చేయకుండా, పవర్‌హౌస్, జెన్‌కో కాలనీ, గ్రామంలోని జెన్‌కోకు సంబంధించిన కీలక అంశాలను బహిర్గతం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న సదరు ఎస్పీఎఫ్ అధికారిని గతంలోని చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు కూడా అప్పట్లో విచారించినట్లు సమాచారం. జెన్‌కో గృహం ఆక్రమణ విషయమై ప్రస్తుత చీఫ్ఇంజినీర్ కాంతారావును వివరణ కోరగా.. ఎస్పీఎఫ్ ఎస్ఐ ఆధీనంలో ఉందని, ఏ పొరపాటు జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్పీఎఫ్ ఆర్ఐ డి.వి.రమణను వివరణ కోరగా అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదు రావడంతో అక్కడికి వెళ్లి ఆ గృహాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు.